ప్రజాశక్తి

బుధవారం 23 ఆగస్టు 2023 5

శ్రీ సత్యసాయి

సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి గాండ్లపెంట

మండల పరిధిలోని కటారపల్లి నూతన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 40 లక్షలతో సచివాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హమీద్‌బాసా, ఎంపిపి జగన్మోహన్, వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎస్ ఫయాజ్ అలీ, ఆర్‌బికె చైర్మన్ వైవి శంకర నాయుడు, సర్పంచులు గంగోజమ్మ, రవీంద్ర నాయక్, నాగభూషణం రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఓట్ల రాజకీయం..!



సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో జిల్లాలో 'ఓట్ల' రాజకీయాలు ఊపందుకున్నాయి. దొంగ ఓట్లను చేర్చారంటూ ప్రతిపక్ష టిడిపి ఆరోపిస్తుండగా, దొంగగా తొలగించేందుకు సిద్ధపడ్డారని అధికార వైసిపై ఆరోపిస్తోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఇరు పార్టీలు ఓటర్ల జాబితాపై నిశితంగా దృష్టి సారిస్తున్నాయి. చిన్న తప్పు దొరికినా పట్టుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. వీటి నడుమ ఉద్యోగులు నలుగుతున్నారు. వినకుంటే ఒక సమస్య... వింటే మరో సమస్య అన్న విధంగా మారింది ఉద్యోగుల పరిస్థితి. ఇప్పటికే కొంత మందిపై వేటు పడటంతో మరింత గుబులు రేపుతోంది. ఓటర్లు జాబితాలో అవకతవకల్లో ఇటీవల జిల్లా ముఖ్య అధికారులిద్దరిపై కేంద్ర ఎన్నికల సంఘం కొరాఢా ఝుళిపించింది. అంతకు మునుపు ఇద్దరు బిఎల్ఒలపై పడగా, తాజాగా మరో ఇద్దరిపై వేటుపడింది. వరుసగా ఇటువంటి చర్యలుంటుండటంతో ఉద్యోగుల్లో మరింత గుబులు రేకెత్తిస్తోంది.

- నలుగుతున్న ఉద్యోగులు
- పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్లు మండలంలోని చిలకురికి గ్రామంలో మూడు వేల ఓట్లను నిబంధనలకు విరుద్ధంగా, ఓటర్లు ఉన్నా శాశ్వత వలస వెళ్లారని చూపించి తొలగించారని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆరోపించారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం నేరుగా అక్కడికి వచ్చి విచారణ చేపట్టింది. ఈ విచారణలో నిబంధనలు పాటించలేదని తేలడంతో ఇద్దరు బిఎల్ఒలతోపాటు, ఎలక్ట్రోరల్, రిటర్నింగ్ అధికారులు ఇద్దరు జిల్లా స్థాయి అధికారులను సస్పెన్షన్ చేశారు. ఇది ఇలాగుంటే అధికార వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కూడా టిడిపి నాయకులకు దొంగ ఓట్లు చేర్చారంటూ ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇలా ఇద్దరి మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగుతున్నాయి. ఓట్ల వ్యవహారంపై రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గంలోనూ టిడిపి వైపు నుంచి మాజీ మంత్రి పరిటాల సునీత ఆరోపిస్తుండగా, వైసిపి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రత్యారోపణలు చేస్తున్నారు. టిడిపి నాయకులు ఓటర్లకు తెలియకుండానే 15 వేల ఓట్లను ఆన్‌లైన్‌లో తొలగించేందుకు వారంతట వారే దరఖాస్తు చేసుకున్నట్టు చూపించి ప్రయత్నం చేసారని ఆరోపించారు. ఈ నియోజకవర్గంలోనూ ఇద్దరి మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఇది ఇతర ప్రాంతాలకు విస్తరిస్తోంది.

నలుగుతున్న అధికారులు

రెండు ప్రధాన పార్టీల నాయకులు ఓటర్ల జాబితాను అడ్డుపెట్టుకుని ఆడుతున్న రాజకీయ క్రీడలో ఉద్యోగులు నలిగిపోతున్నారు. అవునంటే ఒకరికి కోపం లేదంటే మరికొరికి కోపం అన్న విధంగా మారింది పరిస్థితి. ఓటర్ల జాబితాను పూర్తి స్థాయిలో రూపొందించే క్రమంలో భాగంగా ఎన్నికల సంఘం జులై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఇంటింటి సర్వేను చేపట్టింది. అయితే ఈసర్వే ఆన్‌లైన్‌లో చేసే క్రమంలో యాప్‌లో సాంకేతిక సమస్యలు అధికంగా వచ్చాయి. సర్వర్ సమస్యతో పూర్తి స్థాయి ఆన్‌లైన్ సర్వే జరగలేదు. అతి కష్టం మీద యాభై శాతం వరకు చేయగలిగారు. తక్కినది ఆఫ్‌లైన్‌లో చేసి సరిచేసే చర్యలు కొనసాగుతున్నాయి. అయితే ఇంటింటి సర్వే చేసే క్రమంలోనూ ఉద్యోగులకు తిప్పలు తప్పలేదు. ఎందుకంటే బూత్ లెవల్ అధికారులుగానున్న వారందరూ అధిక శాతం సచివాలయ ఉద్యోగులే ఉన్నారు. వారిలో కొంత మంది సాధారణ విధులూ ఉన్నాయి. ఈక్రమంలో ఇంటింటి సర్వేను పూర్తి స్థాయిలో చేయడంలో ఇబ్బందులు నెలకొన్నాయి. ఆ సమయంలో కొన్ని తప్పిదాలు జరిగే అవకాశాలూ లేకపోలేదన్న అభిప్రాయం ఉద్యోగ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. ఈ రకంగానే వజ్రకరూరులో ఇద్దరు బూత్‌లెవల్ అధికారులను జిల్లా కలెక్టరు సస్పెండ్ చేశారు. ఇంటింటి సర్వే చేయలేదు. అయితే సదరు ఉద్యోగులు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్‌గా పనిచేవారు. అతడికి ఇది వరకే తను పనిచేసే చోటే కాకుండా మరో రెండు చోట్ల ఇన్‌ఛార్జి బాధ్యతలూ ఉన్నాయి. ఆ పనే ఎక్కువగానున్న సమయంలో అదనంగా బిఎల్‌ఒ పనిచేయడం ఇబ్బందికరంగా మారింది. సర్వే చేపట్టలేదని చర్యలు తీసుకోవడంతో ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డారు. సొంత పని భారమే ఎక్కువగా ఉండగా అదనంగా ఓటర్ల జాబితా మరింత భారమడంతోనూ ఉద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటు పనిభారం, అటు రాజకీయ నేతల ఒత్తిళ్ల నడుమ నలిగిపోతున్నారు.

అక్రమంగా రోడ్డు నిర్మించొద్దు

మహిళా రైతు రిట్ పిటిషన్‌పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం, కొత్త పూలవాండ్లపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు కె.భారతమ్మకు సంబంధించిన పెద్దన్నవారి పొలం పరిధిలోని సాగు భూమిలో కొత్త పూలవాండ్ల పల్లి నుంచి పెద్దన్నవారిపల్లె వరకు ఏర్పాటు చేస్తున్న రహదారి రైతు సమ్మతం లేనందున తక్షణమే నిలుపుదల చేయాలని రాష్ట్ర హైకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సదరు రైతు కె.భారతమ్మ తన పొలంలోని హరిజనవాడ గుడ్డం నుంచి సంబంధిత అధికారులు తనతో ఎలాంటి అనుమతి తీసుకోకుండా, నోటిఫికేషన్ ఇవ్వకుండా అక్రమంగా రోడ్డు వేయడం చట్ట విరుద్ధమని, వ్యవసాయ భూమి పక్కన కాకుండా సాగు భూమి మధ్యలో రోడ్డు వేసి తనకు నష్టం కలిగిస్తున్నారని అధికారులకు విన్నవించినా, అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో రైతు భారతమ్మ న్యాయవాది ద్వారా విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రయివేటు ఆస్తి అని తెలిసినా కూడా అధికారులు చట్టబద్ధమైన ప్రక్రియ పాటించకుండా సాగు భూమి మధ్యలో రోడ్డు నిర్మాణం చేపట్టడం, పిటిషనర్ హక్కులను కాలరాయడమేనని భూసేకరణ, పునరావాసం, పునరావాస చట్టం 2013 నిబంధనలను ఉల్లంఘించారని పిటిషనర్ హైకోర్టులో తన న్యాయవాది ద్వారా రిట్ దాఖలు చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా, న్యాయపరమైన పరిహారం అందించకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ రైతుకు చెందిన సాగు భూమిలో రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తున్నారని, చట్టబద్ధమైన హక్కులను హరిస్తున్నారని పిటిషనర్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఏకీభవించిన హైకోర్టు పిటిషనర్‌కు సంబంధించిన 12 ఎకరాల వ్యవసాయ భూమిలో రోడ్డుకు సంబందించిన పనులు చేపట్టరాదని స్టే విధించారు.

డిటికి వినతిత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

25 నుంచి నిరవధిక సమ్మె

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

శ్రీసత్యసాయి నీటిపథకం నిర్వహణకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించపోవడంతో పాటు తమకు ఐదునెలల నుండి వేతనాలు ఇవ్వలేదని దీంతో ఈనెల 25వ తేదీనుండి నిరవదిక సమ్మెకు దిగుతున్నామని సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహాశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యసాయి కార్మికులు మాట్లాడుతూ సత్యసాయి నీటి పథకం ద్వారా దాదాపు 10వేల గ్రామాలకు, 10లక్షల జనాభాకు 572 మంది కార్మికులు రాత్రింబవళ్లు కష్టపడుతూ తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అలాంటి పథకానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించలేదని, అదేవిధంగా తమకు ఐదు నెలల వేతనాలు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వేతనాలు ఎప్పుడు ఇస్తారో ఎలా ఇస్తారో చెప్పలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారన్నారు. ఈ క్రమంలో ప్రజలను ఇబ్బందుల్లోకి పడేసే ఉద్దేశం లేకపోయినా తప్పని పరిస్థితుల్లో నిరవదిక సమ్మెకు దిగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు రామచంద్ర, శ్రీనివాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లెడుబండ రిజర్వాయర్ ముంపు రైతులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి బుక్కపట్నం

జిల్లెడు బండ రిజర్వాయర్ ద్వారా ముంపునకు గురవుతున్న రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామ సమీపాన నిర్మాణ దశలో ఉన్న జిల్లేడు బండ రిజర్వాయర్‌ను పరిశీలించి రైతులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లేడు బండ రిజర్వాయర్ ద్వారా భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు నష్టపరిహారం అందిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసమే ప్రాజెక్టులను నిర్మిస్తుందని రిజర్వాయర్ ద్వారా రైతుల భూములను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అధికారులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి నష్ట పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్, ఇరిగేషన్ శాఖ అధికారులు, తహశీల్దార్ కరుణాకర్, ఎంపిపి శ్రీధర్ రెడ్డి , అగ్రి అడ్వైజర్ చైర్మన్ రమణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, కన్వీనర్ సుధాకర్ రెడ్డి, నాయకులు విజయ రెడ్డి రైతులు పాల్గొన్నారు .

ఉచిత కంటి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం టౌన్ : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఉచిత వైద్య, కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మురళీధర్ పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన నిర్వహించబడుతున్న ఉచిత మెగా హెల్త్ క్యాంప్ కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. అదేవిధంగా ఈనెల 29న ఆత్మకూరు మండలం పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మురళీధర్, నరేందర్ రెడ్డి, సత్రశాల ప్రసన్నకుమార్, విద్యాసాగర్, మనోహర్ గుప్తా, పాల్గొన్నారు.

టిడిపి మండల నూతన గృహ సారధుల నియామకం

గుడిబండ : టిడిపి మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, ఆదేశాల మేరకు జిల్లా లింగాయత్ అధ్యక్షులు గుడిబండ గ్రామానికి చెందిన దుర్గేష్ ఆధ్వర్యంలో టిడిపి మండల గృహ సారధులను నియమించినట్లు దుర్గేష్ తెలిపారు. యూనిట్ ఇన్‌ఛార్జిగా జానీ, బూత్ ఇన్‌ఛార్జిగా నాగరాజు, రామచంద్ర, వెంకటరమణ, అజగర్, కృష్ణప్ప, విజయకుమార్, రాజ్ కుమార్, దేవరాజును నియమించినట్లు దుర్గేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి భీమరాజు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వైసిపిలో ముసలం

కదిరి వైసిపిలో ముసలం మొదలైంది. అధికార పార్టీలో మూడు గ్రూపులు ఎవరికి వారే అన్నట్లు రాజకీయాలు చేస్తున్నారు. ఎన్నికల సమీపిస్తున్న సమయంలో ఒకరిపైఒకరు ఎత్తుకుపైఎత్తులు వేసుకుంటున్నారు. కదిరి మున్సిపాల్టీ కేంద్రంగా వైసిపిలో రాజకీయ విభేదాలు తారాస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. చైర్మన్ మార్పు కోరుతూ అసమ్మతి కౌన్సిలర్లు ఏకంగా క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. గత వారం రోజులుగా ఈ వ్యవహారం నడుస్తున్నా సోమవారం రాత్రి నుంచి ఇవి తీవ్ర రూపం దాల్చాయి. అధికార పార్టీ కౌన్సిలర్లు క్యాంపు రాజకీయాలకు తెరలేపి పార్టీలో చీలకదిశగా తతంగం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.

- కదిరి చైర్‌పర్సన్ మార్పునకు కౌన్సిలర్లు పట్టు
- మొదలైన క్యాంపు రాజకీయాలు
- క్యాంపునకు వెళ్లిన 20 మంది వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-కదిరి అర్బన్, టౌన్

కదిరి మున్సిపాల్టీకి సంబంధించి గత మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి విజయం సాధించింది. 36 వార్డులు ఉండగా అధికార వైసిపి గతంలో ఎన్నడూ లేనివిధంగా 31 వార్డులను కైవసం చేసుకుంది. ప్రతిపక్ష టిడిపి 5 వార్డులను గెలుచుకుంది. దీంతో అప్పట్లో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి అధ్వర్యంలో పరికి నజీమున్నీసా సాధిక్‌ను ఛైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారు. ఈ ఎన్నిక సమయంలో మొదటి రెండున్నర సంవత్సరాలు ఆమె ఛైర్‌పర్సన్‌గా ఉండగా మిగతా రెండున్నర సంవత్సరం మరో వ్యక్తి ఛైర్మన్ బాధ్యతలు అప్పగించేలా నిర్ణయం జరిగినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ మేరకు ప్రస్తుత ఛైర్‌పర్సన్ రెండున్నర సంవత్సరాల సమయం ముగిసింది. అయినా ఆమె పదవికి రాజీనామా చేయకపోవడంతో కౌన్సిలర్లు క్యాంపు రాజకీయాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. క్యాంపునకు వెళ్లిన దాదాపు 20 మంది కౌన్సిలర్లు ఏకంగా వీడియోలు విడుదల చేశారు. తాము క్యాంపులో ఉన్నామన్న విషయాన్ని వారే బహిర్గతగం చేస్తున్నారు. దీనిపై వైసిపి అధిష్టానం మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు.

అధికార పార్టీలో గ్రూపు విభేదాలు

గత మున్సిపల్ ఎన్నికల్లో ఏమాత్రం పార్టీ కోసం పనిచేయని వ్యక్తికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టారన్న ఆరోపణలు అప్పట్లో వ్యక్తం అయ్యాయి. అప్పుడప్పుడు కొందరు కౌన్సిలర్లు, ఛైర్‌పర్సన్ మధ్య మున్సిపాల్టీలోనే వాదోపవాదాలు జరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఛైర్‌పర్సన్ వర్గం అసమ్మతిని పెంచిపోషించి అధికార పార్టీలో కలతలు తెచ్చే కుట్ర చేస్తున్నారనే భావనను కొందరు కౌన్సిలర్లు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఛైర్‌పర్సన్‌ను మార్చాలని ఎమ్మెల్యే వద్ద కొందరు కౌన్సిలర్లు పట్టుబట్టినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే కౌన్సిలర్లు సోమవారం రాత్రి క్యాంపు రాజకీయాలకు తెరలేపి అజ్ఞాతానికి వెళ్లారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవిని మార్చడానికి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి పొందడానికి చాలామంది ప్రయత్నిస్తున్నట్లు సమచారం. ఒకవేళ ఛైర్‌పర్సన్ పదవిని కదిలిస్తే కదిరిలో ప్రస్తుతం ఉన్న మూడు గ్రూపులు ఐదు గ్రూపులు కావడం తథ్యమని వైసిపివారే బహిరంగ వ్యాఖ్యానిస్తున్నారు. ఈ మధ్యకాలంలో వైసిపి ముఖ్యనేతలతో ఛైర్‌పర్సన్ కుటుంబ సభ్యుల మధ్య దూరం పెరిగిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పార్టీకి పనిచేసిన వారిని పక్కన పెట్టి పిలిచి పదవి ఇచ్చిన వ్యక్తులు ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా గ్రూపులు చేయడం ఎంతవరకు సబబు అని మరో వర్గం ప్రశ్నిస్తోంది. ఛైర్‌పర్సన్ పదవిని ఇతరులకు ఇవ్వడానికి ప్రయత్నిస్తే మైనార్టీలకే ఇస్తారనే ప్రచారం కూడా బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఛైర్‌పర్సన్ మాత్రం తాను ఎమ్మెల్యే, అధిష్టానం సూచన మేరకు నడుచుకుంటున్నానని, వారు ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని తన మద్దతుదారులు వద్ద చెబుతున్నారు.

క్యాంపులో ఉన్న కదిరి అసమ్మతి కౌన్సిలర్లు

ఎమ్మెల్యే టికెట్టు రేసులో పలువురు...

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కదిరి నియోజకవర్గం నుంచి టికెట్టును పొందేందుకు ఆశావహులు ఒక్కొక్కరిగా తెరపైకి వస్తున్నారు. అందులో భాగంగా ఆ పార్టీ వైసిపి ఎమ్మెల్యే టికెట్టు మైనార్టీలకు కేటాయిస్తారని, ఇందులో భాగంగా తమకే అవకాశం దక్కుతుందని ఆ పార్టీ మైనార్టీ నాయకులు ధీమాగా ఉన్నారు. అందులో భాగంగా వైసిపి తరపున ఓ మైనార్టీ నాయకుడు ఇటీవల తెరపైకి వచ్చాడు. తాను ఎమ్మెల్యే అభ్యర్థినంటూ ప్రచారం కూడా చేసుకుంటున్నారు. దీనిపై నియోజకవర్గ ముఖ్యప్రజాప్రతినిధి అనుచరులు తీవ్ర స్థాయిలోనే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అధికార పార్టీ నేతల మధ్య నేలకొన్న విభేదాలు భవిష్యత్తులో మరింత ముదిరే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

'పురం' వైసిపిలో దుమారం

కాకరేపుతున్న ఛైర్‌పర్సన్ భర్త అరెస్టు

హిందూపురం : అధికార పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలు దుమారం రేపుతున్నాయి. హిందూపురం నియోజక వర్గ ఇన్‌ఛార్జి దీపిక వేణు రెడ్డికి అధికార పార్టీకి చెందిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ నడుమ సై అంటే సై సైగా వ్యవహరిస్తుండడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఛైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్‌పై పెండింగ్‌లో ఉన్న ఓ మట్కా కేసులో పోలీసులు అరెస్టు చేయడం అధికార పార్టీలో కలకలం రేకెత్తిస్తోంది. శ్రీనివాస్‌తో పాటు మరో నలుగురుని టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కాగ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఛైర్‌పర్సన్ ఇంద్రజ జాతీయ జెండాను సైతం ఎగర వేయకుండా అటు అధికారులు, ఇటు సొంత పార్టీ పాలకవర్గం సభ్యులు పావులు కదిపారు. ఆ సందర్భంలో అధికారుల తీరుపై తీవ్ర విస్మయానికి గూరైన ఛైర్‌పర్సన్ ఇంద్రజ మున్సిపల్ కార్యాలయం నుంచి వెళ్లిపోయింది. అనంతరం మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామి రెడ్డి, ఇన్‌ఛార్జి దీపిక తదితరులు జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక పోతే ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ కు తాము అనుకూలమని నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ దీపిక వేణు రెడ్డి వర్గం గత కొంత కాలంగా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఛైర్‌పర్సన్ ఇంద్రజ భర్త శ్రీనివాస్ ఆరోపిస్తున్నారు. గత మున్సిపల్ పాలక వర్గ సమావేశ సమయంలో సొంత పార్టీకే చెందిన మెజార్టీ పాలక సభ్యుల నుంచి ఇంద్రజకు చేదు అనుభవం ఎదురైంది. ఆరు మంది వైకాపా కౌన్సిలర్లు మినహ ఆమెకు మద్దతు లేక పోవడం, టిడిపి సభ్యుల సహకారంతో సమావేశం నిర్వహించారు. ఈ తతంగాన్ని అంత దీపిక వేణు రెడ్డి వర్గంలోని కొంత మంది కౌన్సిలర్లు నడిపినట్లు వార్తలు వినపిస్తున్నాయి. గత కొంతకాలంగ ఛైర్‌పర్సన్ ఇంద్రజ దీపిక వర్గంలో చేరాలని ఒత్తిడిలు వస్తున్నాయి. ఆమె చేరక పోవడంతోనే అధికార పార్టీలో ముఖ్యనేతలు ఛైర్‌పర్సన్ భర్తను అరెస్టు చేయించినట్లు పట్టణంలో వార్తలు వినిపిస్తున్నాయి. సోమవారం రాత్రి ఛైర్‌పర్సన్ వర్గంలో ఉండే కౌన్సిలర్లు దీపిక వర్గంలో చేరారు. అయితే వారు వైస్ ఛైర్మన్‌ను మార్చడంతో పాటు మరికొన్ని డిమాండ్స్ వారు ముందు ఉంచినట్లు తెలుస్తోంది. ఈ డిమాండ్స్ పరిష్కరిస్తే ఛైర్‌పర్సన్ సైతం దీపిక వర్గంలో కలుస్తోందని వారు చెప్పినట్లు సమచారం. దీంతో పాటు మంగళవారం కొందరు పెద్దలు చర్చలు సాగిస్తున్నట్లు సమచారం. ఏదిఏమైన దాదాపు అందరు ముఖ్యనేతలతో పాటు మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు, కౌన్సిలర్లు దీపికకు మద్దతు పలకగా ఛైర్‌పర్సన్ మాత్రం సై అంటే సైసై అంటుండడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది.

కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

ఎపిఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఉద్యోగులు

ప్రజాశక్తి-హిందూపురం

విఒఎల ఉపాధిని దెబ్బతీసే 3 సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దుచేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన యానిమేటర్స్ జనరల్ బాడీ సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎపిఎం రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతు ఒహెచ్ఆర్ పాలసీ అమలు చెయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నిరకాల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విఒల మెర్జి చేయటంవలన వేలాది మంది విఒలకు ఉపాధి పోతుందన్నారు. ఇది మానవ వనరులకు విఘాతం కలిగించటమే అవుతుందన్నారు. ఇప్పటి వరకు 15 సంఘాల లోపు ఉన్న విఒల విఒఎలకు వేతనాలు చెల్లించలేదన్నారు. విఒఎలుగా ఉపాధి కోల్పోయిన వారందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, వయసు పై బడిన వారికి, అనారోగ్యంతో ఉన్న వారి కుటుంబ సభ్యులకు విఒఎలుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప, యూనియన్ కార్యదర్శి కిష్టప్ప, కోశాధికారి హరీష్ బాబు, నాయకులు బైలప్ప, సుజాత, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు :సిఐటియు

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్వీపర్ల సమస్యలను పరిష్కరించక పోతే దశల వారీగా ఉద్యమాలు చేపడుతామని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎంఇఒ గంగప్పను కలిసి వారు ఎదుర్కోంటున్న సమస్యలపై వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా నరసింహప్ప మాట్లాడుతు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తోందన్నారు. అయితే ఆ పాఠశాలలను నిత్యం శుభ్రం చేసే కార్మికులను పూర్తిగా విస్మరిస్తున్నదన్నారు. శానిటేషన్ సిబ్బందికి ఇస్తున్న వేతనం రూ. 6వేల నుంచి రూ. 21 వేలకు, కంటెజెంట్ ఆయాలకు రూ.4వేల నుంచి రూ. 21వేలకు పెంచాలన్నారు. అందరికి గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి, పర్మినెంట్ చేయాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించక పోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. దశల వారి ఉద్యమాల్లో భాగంగా ఈ నెల 28న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా, 31న ఎమ్మెల్యేలకు, ఎంపీలకు వినతి పత్రాలు అందజేస్తామని చెప్పారు. సెప్టెంబర్ 18న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతామన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించక పోతే సమ్మెలోకి వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు సరోజమ్మ, వన్నూరమ్మ, దిల్షాద్, షాహినా, రత్నమ్మ, హుస్సేన్ అమ్మ, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కమిటీ సమావేశాన్ని బహిష్కరించిన కార్మికులు

ఎంపిడిఒ కార్యాలయం బయట బైఠాయించిన కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా జాయింట్ కమిటీ సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించాలన్న జిల్లా అధికారుల ప్రయత్నాన్ని సిఐటియు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్మికులు అడ్డుకున్నారు. సమావేశాన్ని బహిష్కరించారు. మంగళవారం పుట్టపర్తి ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని 32 మండలాల పంచాయతీ కార్యదర్శులు, స్వచ్ఛభారత్ కార్మికులు, సిఐటియు నాయకులతో జాయింట్ కమిటీ సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. గత రెండు మూడు సంవత్సరాల నుండి స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు అందలేదని దానికి తోడు పలు డిమాండ్లతో గత నెలలో రెండుసార్లు స్వచ్ఛభారత్ కార్మికులు జిల్లా కలెక్టరేట్, డిపిఒ కార్యాలయాల ముట్టడి చేశారు. ఆ సందర్భంగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ డిపిఒ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన పుట్టపర్తిలో జాయింట్ కమిటీ సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. దాంతో శాంతించిన కార్మికులు యధావిధిగా విధుల్లోకి వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం నిర్వహించిన జాయింట్ కమిటీ సమావేశం కార్మికుల సమస్యలు చర్చించడానికి డిఎల్పిఒ, పుట్టపర్తి ఈఓ ఆధ్వర్యంలో జిల్లాలోని 32 మండలాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్, డిపిఒ హాజరు కాలేదు. ఇది గ్రహించిన సిఐటియు

రెండు గంటల పాటు ఉద్యోగులు నిర్బంధం

నాయకులు, స్వచ్ఛభారత్ కార్మికులు సమావేశానికి హాజరు కాకుండా సమావేశ మందిర ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఏపీ గ్రామపంచాయతీ నౌకర్ల సంఘం అధ్యక్షులు సజ్జరాయప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, వ్యవసాయ కార్మిక కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, సిఐటియు బాబావలి,స్వచ్ఛభారత్ కార్మికులు బయట నుంచి నిరసన వ్యక్తం చేశారు. సమావేశ మందిరంలో ఉన్న వారిని బయటికి రానివ్వకుండా బయట ఉన్న వారిని లోపలికి వెళ్లనివ్వకుండా రెండు గంటల పాటు ప్రధాన ద్వారం వద్ద అడ్డుకున్నారు. దీంతో లోపల ఉన్న అధికారులు ఏమి చేయలేని స్థితిలో ఉండిపోయారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా సమావేశం ఏర్పాటు చేసి కనీస వసతులు కూడా కల్పించలేని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా కార్మికులకు కుర్చీలు కూడా లేవని నీటి వసతి కల్పించకుండా ఏర్పాటు చేసిన ఇదేమి సమావేశమని ప్రశ్నించారు. సమావేశానికి పిలిపించి అవమానించారని అందువలన ఈ జాయింట్ కమిటీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని తెలిపి కార్యాలయం నుండి బయటకు వచ్చారు. తమ సమస్యలను తీర్చకపోతే వారంలోపు ప్రజా సంఘాలతో చర్చించి సమ్మెకు వెళతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఇంటిపైనుంచి పడి కూలీ మృతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని చిన్నూరురోడ్డులో ఓ కూలీ నిర్మాణంలో ఉన్న ఇంటి రెండో అంతస్తు నుంచి జారి పడి మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన రంగనాయకులు(55) కూలిపనుల కోసం ధర్మవరానికి వలస వచ్చి చిన్నూరురోడ్డులో నివాసముం టున్నాడు. అక్కడే నూతన ఇంటినిర్మాణం చేపడుతున్నాడు. ఈ క్రమంలో ఇంటి గోడలకు నీళ్లు పెడుతుండగా రెండవ అంతస్తునుండి ప్రమాదవ శాత్తు కాలు జారి కిందకు పడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు రంగనాయకులును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈవిషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మృతునికి భార్య రామలమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

పేకాట జూదరులు అరెస్టు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సిపిఐకొట్టాల ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.3300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సిఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. తమకు సమాచారం రావడంతో తన సిబ్బంది దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న వెల్లుల చంద్రహాస్, నాగభూషణం, కుండా అశోక్,బొమ్మ నాగభూషణం, చింత అంజనేయులు, జయచంద్రలను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుండి రూ.3300 నగదుతోపాటు రెండు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

చిలమత్తూరు : మండల పరిధిలోని చాగలేరులో ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని మంగళవారం అరెస్టు చేసి వారి వద్ద నుండి 5,270 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు ఆయన చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మడకశిర రూరల్ : మండలం బుళ్లసముద్రం గ్రామ సమీపంలో గల వంకలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ లోకేష్ హెచ్చరించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కొత్తచెరువు రూరల్ : మండల పరిధిలోని ఇరగంపల్లి గ్రామానికి చెందిన సాకే కిష్టయ్య సాకే సునీత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. సునీత కొత్తచెరువు శ్రీ సత్య సాయి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోందన్నారు. ఈనెల 19వ తేదీ ఉదయం కాలేజీకి వెళ్తానని చెప్పి ఇంటి వద్ద నుండి బయలుదేరి తిరిగి రాలేదని, కొత్తచెరువులోను ఇతర ప్రాంతాలలో వెతికిన కనబడలేదని వారి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శికి నోటీసు

పెనుకొండ : 17 జీవో ను రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈ నెల 23న విజయవాడ లో తలపెట్టిన 12 గంటల నిరసన ధర్నాకు వెళ్లరాదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌కు పెనుకొండ పోలీసులు మంగళవారం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తీర్చమని ప్రభుత్వాన్ని అడిగితే, తీర్చకపోగా నిరంకుశంగా అణచివేయడం ఎంత వరకూ సమంజసమనిప్రశ్నించారు.

బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలి

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి మండల వ్యాప్తంగా వ్యవసాయ పనుల్లో, దుకాణాల్లో , వ్యాపారాల్లో, ఇతర పనుల్లో కార్మికులుగా బడి ఈడు పిల్లలు కన్పించరాదని వారిని బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంఇఒ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం పుట్టపర్తి ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని ఎంఆర్‌పిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో డ్రాప్‌అవుట్ లేకుండా చూడాలని, జగనన్న విద్యా దీవెన కిట్ల పంపిణీ వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది నాగరాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది సూచించారు. పుట్టపర్తి మండల పరిధిలోని వెంకటగారి పల్లి గ్రామంలో మంగళవారం గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, జ్వరాలపై అవగాహన కల్పించారు. ,ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీదేవి, సిహెచ్ఒ నగేష్ , సూపర్ వైజర్ చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మీ నారాయణమ్మ పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు, భూరక్ష పై అవగాహన

నల్లచెరువు: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షపై మండల పరిధిలోనిఉబిచెర్ల గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ రీసర్వే విషయంలో రైతులు సర్వే అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, మండల సర్వేయర్, ఆర్ఐ, విఆర్ఒ తదితరులు పాల్గొన్నారు.

గువ్వల లక్ష్మీనారాయణ సేవలు ఆదర్శనీయం

ధర్మవరం టౌన్ : ప్రముఖ వ్యాపారవేత్త, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు గువ్వల లక్ష్మీనారాయణ సేవలు అదర్శనీయమని లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు పిట్టా వెంకటస్వామి, క్లబ్ అధ్యక్షులు గూడూరు మోహన్ దాస్, కార్యదర్శి గూడూరు రాజగోపాల్, కోశాధికారి వేణుగోపాలచార్యులు, మాజీ అధ్యక్షులు మెటికెల కులాయప్ప, గోశే రాధాకష్ణ తదితరులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గవ్వల లక్ష్మీనారాయణ (లడ్డు లక్ష్మీనారాయణ) మృతి తీరని లోటు అని అన్నారు. కురుబ కళ్యాణ మండపానికి దాదాపు 15 లక్షల రూపాయలను విరాళం ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు.

బదిలీ అధికారికి సన్మానం

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లా హోంగార్డు ఆర్ఐ గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీశైలం రెడ్డి సాధారణ బదిలీలలో భాగంగా కడప జిల్లాకి బదిలీ అయిన నేపథ్యంలో మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆయనను సన్మానించారు. ఎస్పీ మాధవ్ రెడ్డి తన చాంబర్లో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్ఐ చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి విష్ణు, ఎఆర్‌డిఎస్‌పి విజయ్ కుమార్ , దిశా డిఎస్‌పి కెవిఆర్ వరప్రసాద్, ఆర్ఐలు టైటాస్, నారాయణ, డిసిఆర్‌బి సి ఐ సుబ్బారావు, దిశ సిఐ యతేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు

అగళి : అగళి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ గాయిత్రి డాక్టర్ శివానంద తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగళి గ్రామానికి చెందిన సుధారాణి కి మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఆమె ఇంటిలో పురిటినొప్పులు రావడంతో తన ఆశావర్కర్ల సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారన్నారు. అన్ని పరిస్థితులు అనుకూలించడంతో సుధారాణికి ఇక్కడే ప్రసవం అయిందన్నారు. అగళి ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పడినప్పటినుంచి ఇక్కడ ఒక డెలివరీ కూడా జరగలేదని చెప్పారు. ఇక నుంచి ఇక్కడే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

కార్మికులకు వేతనాలివ్వండి

కొత్తచెరువు : సత్యసాయి వాటర్ సప్లై లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైనదని సిఐటియు నాయకులు మధు ఐఎఫ్‌టియు కోట్ల రాము విమర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐదు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు జిల్లావ్యాప్తంగా 572 మంది కార్మికులు ఈ వాటర్ సప్లై పథకంలో పనిచేస్తున్నారన్నారు. వేతనాలు అందించకపోతే ఈనెల 25వ తేదీ నుండి నిరవధిక సమ్మె నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా వారు ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఎంపీడీవో సిద్ధారెడ్డికి వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో కొత్తచెరువు బుక్కపట్నం పుట్టపర్తి మండలాల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

తండావాసులకు రోడ్డు సౌకర్యం

ముదిగుబ్బ : మండలంలోని జొన్నల కొత్తపల్లి తండాకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అరుణ్‌బాబు హామీ ఇచ్చారు. తండావాసుల కష్టాలను జెడ్పీటీసీ తిరుమల సేవే నాయక్ కలెక్టర్ అరుణ్ బాబు దృష్టికి తీసుకెళ్లగా కలెక్టర్ తండా రోడ్డు మార్గాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు కోసం భూములు ఇవ్వమని కోర్టుకు వెళ్లిన రైతులతో చర్చించి కచ్చితంగా రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న తాగునీరు, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

టిడిపిలో పలువురు చేరిక

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం ముత్యాల చెరువు పంచాయతీ కొత్తపల్లికి చెందిన కాంట్రాక్టర్ మేస్త్రి నారాయణస్వామి, తదితరులు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ వారికి పార్టీ కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానించారు . ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు కౌలే పల్లి రమేష్ బాబు, కోడి సూర్యనారాయణ, శ్రీనివాసులు, నాగరాజు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత

పెనుకొండ : పట్టణంలోని ఆల్విన్ కాలనీలో నివాసం ఉంటున్న అడదాకుల పల్లికి చెందిన రవీంద్రనాథ్ కుమారుడు డెనియల్ నాయక్ మెడిసిన్ చదవడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంతో దాత చేయూతను అందించారు. కోడిపల్లి గోవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి తన వంతుగా మంగళవారం విద్యార్థికి తన తల్లి సత్యమ్మ చేతులు మీదుగా రూ 10వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ నాయక్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కదిరి అర్బన్ : ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఐనుద్దీన్‌ను ఏపీ మెప్మా అధ్యక్షులు హాజీ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈసందర్భంగా హాజీ ఖాదర్ భాషా మాట్లాడుతూ మరిన్ని ఉత్తమ అవార్డు పొందాలని ఇటువంటి సేవ గుణం కలిగిన వ్యక్తి ఏపీ మెప్మా సభ్యులు కావడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వన్నూరు సాబ్, ఇనాయతుల్లా, రహమతుల్లా, అబ్బాస్ అలీ, నిసార్ పాల్గొన్నారు

మల్బరీ సాగుపై అవగాహన

చిలమత్తూరు : మండలంలోనివీరాపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో సిరి కల్చర్ శాఖ ఆధ్వర్యంలో రైతులకు మల్బరీ సాగుపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న సిరికల్చర్ ఏడీ సురేష్ కుమార్. సైంటిస్ట్ డాక్టర్ సీతారాములు, హైదరాబాద్ అగ్రికల్చర్ సైంటిస్ట్ నరసింహమూర్తి తదితరులు మాట్లాడుతూ రైతులకు మల్బరీ సాగు విధానంపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి రమణారెడ్డి, సచివాలయ ఉద్యోగి సుమిత్ర, హార్టికల్చర్ అధికారిపాల్గొన్నారు.

ఎఫ్‌పిఒ మహాసభ

సోమందేపల్లి : స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ ఉత్పత్తి దారుల పరస్పర సహకార సంఘం ఆరవ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఆర్‌డిఎ పీడీ నరసయ్య హాజరయ్యారు,. రైతు ఉత్పత్తిదారుల సంఘంలో 167 సంఘాలు ఉన్నాయని, మండలంలోని రైతులకు ఎరువులు, మందులు, టార్పాటిన్లు తదితర వాటిని తక్కువ ధరకే అందించామని చెప్పారు.

In the court of the Senior Civil Judge,
Dharmavaram
I.P. No: 10/2022
Between:
Avula Muthyalappa ...petitioner
And
Bille Sreenivasulu
and others ...Respondents
Notice to R4, R5,R6 & R10
R4: Boggu Chinna Narasimhulu S/o Boggu Narasimhulu D.No:1/104, Somandepalli Town and Mandal, Sri Sathya Sai Dist.
R5:C.Narasimhulu S/o C.Nagaraju, Pyadindi Village, C.K.Palli, Mandal, Sri Sathya Sai Dist.
R6: Narayana S/o C.Narasappa R/at Venkatareddy Palli Post, Penukonda Mandal, Sri Sathya Sai Dist.
R10:Kristappa S/o Peddappaiah, R/at Byrapuram, Kothacheruvu Mandal, Sri Sathya Sai Dist.
పై నెంబరు కేసులో రెస్పాండెంట్లు అయిన మీ హాజరు నిమిత్తం 30/08/2023 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
D.ABDUL SAB, Advocate, Dharmavaram.

మహిళా సాధికారతే టిడిపి ధ్యేయం

కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

మహిళా సాధికారతే టిడిపి ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారథి సతీమణి కమలమ్మ పేర్కొన్నారు. మంగళవారం నగర పంచాయతీలోని 8, 9 వార్డులలో మహాశక్తి కార్యక్రమంలో భాగంగా మినీ మ్యానిఫెస్టో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమలమ్మకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వార్డుల్లో ఇంటిఇంటికి తిరుగుతూ భవిష్యత్‌కు గ్యారెంటీ పథకాలను మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, అనసూయమ్మ, నాగమణి, లీలావతి, గాయత్రి, ఆవుల హేమలత, సువర్ణమ్మ, రత్నమ్మ, చంద్రకాంతమ్మ, బీబిజాన్, ఫాహిమా, మైమున్నిసా, షాదిహా, హైమున్, అరుణ, ఫక్రునిషా, హసీనా, కైరూన్, ఫాషిమా, 8వ వార్డు ఇన్‌ఛార్జి షఫీక్, 9వ వార్డు ఇన్‌ఛార్జి వలి పీర్, పట్టణ అధ్యక్షులు రవి శంకర్, కన్వీనర్లు సిద్దయ్య, సిద్దలింగప్ప, మునిమడుగు వెంకటరాముడు, కేశవయ్య,రఘువీర చౌదరి,దారపనేని రామలింగ, హుజూర్ , పాలడుగు చంద్ర, , కన్నా స్వామి, సుబ్బరాయుడు, , జావిద్ భాష, లక్ష్మీనారాయణ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, పోతిరెడ్డి, షౌకత్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆపార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని తిప్పాబాట్లపల్లిలో మంగళవారం మహాశక్తి కార్యక్రమాన్ని టిడిపి నాయకులు కార్యకర్తలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు సప్లయర్స్ రామ్మోహన్, రిటైర్డ్ టీచర్ నాగేంద్ర ప్రసాద్, గాజుల చంద్రమోహన్, సుధాకర్, సురేష్, వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

మాతా శిశు మరణాలను నివారించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

హై రిస్క్ గర్భిణీ స్త్రీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎక్కడా మాతా శిశు మరణాలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ ఎస్‌వి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం పుట్టపర్తి లోని స్త్రీ శక్తి భవనంలో వ్యాక్సిన్ ప్రివెంటబుల్ డీసీజ్ (రొటీన్ ఇమ్యునైజేషన్) వ్యాక్సిన్ ప్రివెంటబుల్ డీసీజ్ చినపుదు, సీరమ్ నమూన , థ్రోట్ నమూనా తీయు విధానం తదితర వాటిపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ముఖ్యంగా పిహెచ్‌సి వైద్యాధికారులకు ఫీల్డ్ లో జరిగే ఇమ్యు నైజేషన్ పైన లోపాలను సరి చేసుకువాలని సూచించారు. గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, హైరిస్క్ గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమములో పిహెచ్‌సి, యుపిహెచ్‌సి, పిపి. యూనిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

విద్యార్థుల పట్ల ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వీడాలని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల కోసం దేవరపల్లి సాధులోలపల్లి తుమ్మలకు బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ బస్టాండ్ ముందు ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు .ఈ సందర్భంగా నాయకులు నల్లజోడు పవన్, శేషం మహేంద్ర మాట్లాడుతూ కదిరి నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ , ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు బస్సులు సమయానికి అనుగుణంగా నడపకపోవడంతో ఆ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థుల జీవితాలను దృష్టిలో ఉంచుకొని సమయానికి అనుగుణంగా బస్సు నడపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవా, గణేష్ విద్యార్థులు వంశీ, శివ, సాయి , బాషా,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సాయి ఆరామం అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బస్సుయాత్రకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, వ్యాకాస జిల్లా కార్యదర్శి గంగాధర్, సిపిఐ పట్టణ కార్యదర్శి గౌస్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుల్లాయప్ప, నాయకులు అరుణ్ రెడ్డి, వెంకటనారాయణ, మహిళా జిల్లా కార్యదర్శి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే వైసిపి ధ్యేయం

సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న మడకశిర ఎమ్మెల్యే

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

అభివృద్ధి, సంక్షేమం, అవినీతి రహిత పాలన అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యం అని పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ తెలిపారు. మండలంలోనిబూచేపల్లి, కొత్తపల్లి, పుట్టగుండ్లపల్లి, గుంతపల్లి గ్రామాలలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలే జయరాం నాయక్, సర్పంచి నర్సిరెడ్డి, ఎంపిటిసి ఓబులరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్, రైతు విభాగం అధ్యక్షులు పాటూరి శంకర రెడ్డి, గోరంట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ బూదిలి వేణుగోపాల్ రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ డాక్టర్ భాషా, మండల అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ పోతుల రామకష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని వైసిపి ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రొళ్ల మండలం హిట్టే బెట్ట పంచాయతీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

25న మాజీ ఎమ్మెల్సీ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి మడకశిర

పట్టణంలోని వైబి హళ్లి రోడ్డు క్రాస్ లో ఈనెల 25న మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. వైటీ ప్రభాకర్ రెడ్డి తండ్రి వైసీ తిమ్మారెడ్డి 1959 నుంచి 70 వ సంవత్సర కాలంలో మడకశిర తాలూకా సమితి ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 1970 - 72 మధ్యకాలంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా, 1972- 78 మధ్యకాలంలో ఎమ్మెల్సీగా, 1982 - 85 మధ్యకాలంలో అనంతపురం జిల్లాలోని ఏకైక కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజకవర్గంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఈ సందర్భంగా తండ్రి చేసిన కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి వివరించారు. ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ మెంబర్ అశోక్ కుమార్ తదితరులు హాజరవుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

విద్యుత్ సమస్యలపై రైతుల ధర్నా

ప్రజాశక్తి - కనగానపల్లి

ఆందోళనలో పాల్గొన్న రైతులు, నాయకులు

మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ట్రాన్స్‌కో ఎఇ స్పందించకపోవటంతో ఆగ్రహించిన రైతులు స్థానిక నాలుగు రోడ్ల సర్కిల్లో మంగళవారం ధర్నా నిర్వహించారు. వీరి ఆందోళనకు రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బెల్లం మహదేవ్, సిపిఐ మండల కార్యదర్శి ఎం బాలరాజు, రైతు సంఘం గౌరవ అధ్యక్షులు గోవిందు, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, మాదినేని సుధాకర్ నాయుడు ములుగురు వెంకటలక్ష్మి తదితరులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలోనూ విద్యుత్ సమస్య నెలకొందన్నారు. విద్యుత్ కోతలు, లోవోల్టేజీతో మోటర్లు ఆడక పోవడం, కాలిపోవటం లాంటివి జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అభివృద్ధి ఊసే లేదు...

తూతూ మంత్రంగా మండలమీట్

మండలమీట్‌లో సగం మందికి పైగా అధికారులు గైర్హాజరు

ప్రజాశక్తి - అగళి

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రేణుక కామరాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి గురించి ఊసే లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి మండల అధికారులు సగం మందికి పైగా హాజరు కాలేదు. ఇక వచ్చిన అధికారులు తమ శాఖకు సంబంధించిన దేడాను చదివి వినిపించారు. అందులో అభివృద్ధి పనులపై ఎలాంటి సమాచారం లేదు. ఉన్న దానిలోఉపాధి హామీ పథకం కింద మాత్రమే కొన్ని పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ పనుల్లో కూడా రెండు నెలల నుంచి ఉపాధి కూలీలకు బిల్లులు రాలేదు. ఏది ఏమైనా మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈసమావేశంలో ఎంపిడిఒ నరేంద్ర, తహశీల్దార్ బాషా, జెడ్పీటీసీ ఉమేష్‌తో పాటు పలువురు అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు